సంపుటి :02 సంచిక :202 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

సోమవారం 06 , అక్టోబర్ 2025

## బీఆర్ఎస్ కు బాకీ
## పదం ఎత్తే అర్హత లేదు

- మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది
- అన్ని వర్గాలకు అన్యాయం చేసింది
- రైతుబంధు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది
- బీఆర్ఎస్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీ ధ్వజం
- బీఆర్ఎస్ చేస్తుంది బాకీ కార్డ్ కాదు డోకా కార్డ్ అని ఫైర్

05





## రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట

- బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ కొట్టివేత
- సంతోషిస్తున్నామన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

02




## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

- జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు, ఎస్ఎస్టీ బృందాలు
- పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చర్యలు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష

02



## నవంబర్ 11న పోలింగ్

- 14న ఓట్ల లెక్కింపు
- ఈనెల 13 నుంచి నామినేషన్ల స్వీకరణ
- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ విడుదల

02



# మావోయిస్టు పార్టీలో కలకలం

## పొలిట్ బ్యూరోకు మల్లోజుల రాజీనామా

- ఉద్యమాన్ని కాపాడలేకపోయినందకు క్షమాపణలు
- అనవసర త్యాగాలకు ముగింపు పలకాలని సూచన
- పార్టీ అధికార జగన్‌పై విమర్శలు



02

మావోయిస్టు పార్టీలో ప్రకంపనలు రేగాయి. పార్టీ అగ్రనేత, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సాయుధ పోరాటాన్ని విరమించాలని క్యాడర్‌కు పిలుపునిస్తూ ఆయన రాసిన లేఖ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కొన్ని అనివార్య కారణాల వల్ల, ఈ పదవిలో కొనసాగే అర్హత తనకు లేదని భావించి పార్టీని వీడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి ఆయన ఓ లేఖ విడుదల చేశారు. పార్టీ ఇప్పటివరకు అనుసరించిన పంథా పూర్తిగా తప్పని, దీనివల్ల ఉద్యమం తీవ్రంగా నష్టపోయిందని అంగీకరించారు. ఉద్యమాన్ని ఓటమి పాలుకాకుండా కాపాడలేకపోయినందుకు తాను క్షమాపణలు కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం ఒక టీకా లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయుధాలు వీడాలనే నిర్ణయంపై పార్టీలో అంతర్గతంగా చర్చ జరిగిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జీవించి ఉన్నప్పుడే ఈ అంశంపై చర్చ జరిగిందని గుర్తుచేశారు. ఈ విషయంలో పార్టీ అధికార ప్రతినిధి జగన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ఫాసిస్టు పరిస్థితుల్లో సాయుధ పోరాటం ద్వారా లక్ష్యాన్ని చేరుకోలేమని స్పష్టం చేశారు. అనవసర త్యాగాలకు ఇకనైనా ముగింపు పలికి, పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవాలని ఆయన హితవు పలికారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని క్యాడర్‌కు సూచించారు.

- అక్షరదర్బార్, హైదరాబాద్



## ఈసీ ఆదేశాలు తుంగలో..

### చెరిపేయని వాల్ రైటింగ్‌లు, జెండాలు

04

స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి (ఎలక్షన్ కోడ్) అమలులోకి వచ్చినా అధికారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికీ రాజకీయ పార్టీల జెండాలు, శిలాఫలకాలు తొలగించలేదు. గోడలపై రాసిన ప్రచార రాతలు (వాల్ రైటింగ్) సైతం చెరిపేయకుండా యథావిధిగా దర్శనమిస్తున్నాయి.


– అక్షర దర్బార్, శాయంపేట

## ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన ఉండాలి

### నామినేషన్ల నుంచి లెక్కింపు వరకు అప్రమత్తత అవసరం

కలెక్టర్ రాహుల్ శర్మ

03



# నవంబర్ 11న పోలింగ్

- 14న ఓట్ల లెక్కింపు
- ఈనెల 13 నుంచి నామినేషన్ల స్వీకరణ
- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ విడుదల

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఉత్కంఠ రేపుతున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే నెల నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ జరగనుంది. 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నెల 13న జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసి అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 21 నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ. ఈ నెల 22న నామినేషన్లను అధికారులు పరిశీలిస్తారు. 24 వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. వచ్చే నెల 11న పోలింగ్ జరగనుండగా 14న ఓట్ల లెక్కింపు చేపడతారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికను ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రచారంలో పోటీ పడుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం జూబ్లీహిల్స్ అభ్యర్థినిగా మాగంటి సునీత పేరును ఖరారు చేసింది. కాంగ్రెస్, బీజేపీలో అభ్యర్థి ఎంపిక కోసం కసరత్తు జరుగుతుంది. ఈ రెండు పార్టీల్లోనూ అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహణ కోసం అధికార యంత్రాంగం కూడా ఏర్పాట్లు చేపట్టింది.






# సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట

- బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ కొట్టివేత
- సంతోషిస్తున్నామన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**అక్షరదర్బార్, న్యూఢిల్లీ :**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోపై సోమవారం సుప్రీంకోర్టులో, బుధవారం హైకోర్టులో విచారణ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల తొలి దశ నోటిఫికేషన్ను ఈ నెల 9న జారీ చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు జారీ చేసిన జీవోపై సుప్రీంకోర్టులో జరగనున్న విచారణపై ఉత్కంఠ నెలకొంది. ఈ జీవో చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్పై సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటు అధికారులను, అటు పార్టీ నేతలను ఆదేశించారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ను సుప్రీంకోర్టు స్వీకరించలేదు.



**- హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా?**

సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలు అయిన పిటిషన్ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ అంశం తెలంగాణ హైకోర్టులో పెండింగ్లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై 2 పిటిషన్లు పెండింగ్లో ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవే, ఏడీవన్ రావు అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్ను జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసింది.

## సంతోషిస్తున్నాం : డిప్యూటీ సీఎం భట్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ జీవోపై కొందరు సుప్రీంకోర్టులో కేసు వేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వేసిన కేసును కోర్టు డిస్మిస్ చేసినందుకు సంతోషిస్తున్నా మని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రజలు కోరుతున్నారని, ప్రతిపక్ష నేతలు ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీసేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన సర్వే నివేదికను అసెంబ్లీ ముందుంచామని తెలిపా రు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందని, శాసనసభలో ఉన్న అన్ని పార్టీలు బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు.

# మావోయిస్టు పార్టీలో కలకలం

- పొలిట్ బ్యూరోకు మల్లోజుల రాజీనామా
- ఉద్యమాన్ని కాపాడలేకపోయినందుకు క్షమాపణలు
- అనవసర త్యాగాలకు ముగింపు పలకాలని సూచన
- పార్టీ అధికార ప్రతినిధి జగన్ పై విమర్శలు

అక్షరదర్బార్, హైదరాబాద్: మావోయిస్టు పార్టీలో ప్రకంపనలు రేగాయి. పార్టీ అగ్రనేత, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సాయుధ పోరాటాన్ని విరమించాలని క్యాడర్కు పిలుపునిస్తూ ఆయన రాసిన లేఖ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కొన్ని అనివార్య కారణాల వల్ల, ఈ పదవిలో కొనసాగే అర్హత తనకు లేదని భావించి పార్టీని వీడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ క్యాడర్ను ఉద్దేశించి ఆయన ఓ లేఖ విడుదల చేశారు. పార్టీ ఇప్పటివరకు అనుసరించిన పంథా పూర్తిగా తప్పని, దీనివల్ల ఉద్యమం తీవ్రంగా నష్టపోయిందని అంగీకరించారు. ఉద్యమాన్ని ఓటమి పాలు కాకుండా కాపాడలేకపోయినందుకు తాను క్షమాపణలు కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం ఒక టీకా లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయుధాలు వీడాలనే నిర్ణయంపై పార్టీలో అంతర్గతంగా చర్చ జరిగిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జీవించి ఉన్నప్పుడే ఈ అంశంపై చర్చ జరిగిందని గుర్తుచేశారు. ఈ విషయంలో పార్టీ అధికార ప్రతినిధి జగన్పై ఆయన విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ఫాసిస్టు పరిస్థితుల్లో సాయుధ పోరాటం ద్వారా లక్ష్యాన్ని చేరుకోలేమని స్పష్టం చేశారు. అనవసర త్యాగాలకు ఇకనైనా ముగింపు పలికి, పార్టీ క్యాడర్ను కాపాడుకోవాలని ఆయన హితవు పలికారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని క్యాడర్కు సూచించారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

- జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు, ఎస్ఎస్టీ బృందాలు
- పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చర్యలు
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ: స్థానిక సంస్థల ఎన్నికలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చెప్పారు. సోమవారం హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, స్నేహ శబరీష్, రిజ్వాన్ బాషా షేక్, డీసీపీలు, ఏసీపీలు, జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్ పోస్టుల ఏర్పాటు, బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు.

సమావేశంలో సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్టులను, ఎస్ఎస్టీ బృందాలను ఏర్పాటు చేసి డబ్బు, మద్యం తరలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రూట్ మ్యాపులను ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రెండు రెవెన్యూ డివిజన్ల వారీగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్ పోస్ట్, ఎస్ఎస్టీ బృందాలు తనిఖీలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులు సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో సజావుగా ఎన్నికల నిర్వహణపై సమీక్ష చేసుకోవాలన్నారు. సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్రనాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, జడ్పీ సీఈఓలు రవి, రామ్ రెడ్డి, డీపీఓలు కల్పన, లక్ష్మీ రమాకాంత్, స్వరూప, ఆర్డీఓ ఉమారాణి, ఏసీపీలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరిక

అక్షర దర్బార్, శాయంపేట : మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సమక్షంలో శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన మాజీ సోషల్ మీడియా ఇంచార్జి మామిడి అశోక్ మరియు ఎమ్మార్పీఎస్ మండల వికలాంగుల శాఖ అధ్యక్షుడు మామిడి కుమార స్వామి బిఆర్ఎస్ పార్టీలోకి చేరగా వారికి గండ్ర గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



# గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

**పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి**

అక్షర దర్బార్, చిట్యాల : గ్రామాల అభివృద్ధి ప్రపంచ స్థాయిలో దేశాన్ని అగ్రగామిగా నిలిపిన బీజేపీతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి పేర్కొన్నారు. చిట్యాల మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామపంచాయతీలో బీజేపీ జెండా ఎగురవేయాలి. ZPTC, MPTC, సర్పంచి స్థాయిలో ఎక్కువమంది అభ్యర్థులు గెలిస్తే గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పార్టీ బలమైన పునాది ఏర్పడుతుంది," అని ఆమె అన్నారు. ఉజ్వల యోజన, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, జనధన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు కోట్లాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చాయని, వీటిని ప్రజల్లో విస్తృతంగా చాటి చెప్పడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఏడు నూతుల నిషిధర్ రెడ్డి, పార్లమెంట్ కో-కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తీగల జగ్గయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గలీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రె శశి, జిల్లా కార్యదర్శి సుధా గాని శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, రావుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.







## 'రెడ్డిగాండ్ల'ను బీసీలుగా అనర్హులుగా ప్రకటించాలి

భూపాలపల్లి, అక్షర దర్బార్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో "రెడ్డి గాండ్ల"ను బీసీలుగా అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కాటారం డివిజన్ అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేసింది. రెడ్డిగాండ్ల వారు తప్పుడు కుల ధృవీకరణ పత్రాలతో రాజకీయ లబ్ది పొందుతూ నిజమైన గాండ్ల, బీసీ సమాజానికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాటారం డివిజన్ బీసీ జాక్ కన్వీనర్, అఖిల గాండ్ల తిలకుల కాటారం అధ్యక్షులు మైనర్ బాబు, గౌరవ అధ్యక్షులు నిడిగొండ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జక్కం సురేష్, సర్వ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెన్నంపల్లి మహేష్, కార్యదర్శులు నిడిగొండ చెన్నకేశవ్, పిలుమరి సంపత్, నిడిగొండ రాజు, నిడిగొండ శ్రావణ్ పాల్గొన్నారు.



## కన్నుల పండువగా ఎల్లమ్మ బోనాలు

అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు సోమవారం రేణుక ఎల్లమ్మ తల్లికు వందలాది బోనాలు సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పట్టణంలోని గౌడ సంఘం అధ్యక్షులు కోలా వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శి మద్దెల శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రతి కుటుంబం బోనాలతో శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయం చేరి భక్తులు దేవతల కళ్యాణ పూజ, రేణుక ఎల్లమ్మకు గావుపట్టడం కార్యక్రమంలో పాల్గొని ధూప, దీప, నైవేద్యాలతో పూజలతో ఉత్సవాన్ని ముగించారు.  కార్యక్రమంలో సంఘం నాయకులు, గౌడ వెల్ఫేర్ అధ్యక్షులు, జిల్లా మరియు డివిజన్ స్థాయి గౌడ సంఘాల నేతలు హాజరై ఘనతను అందించారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

**బీజేపీ, బీఆర్ఎస్ కు బుద్ధి చెప్పాలి**

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**



అక్షర దర్బార్, పరకాల: సోమవారం రోజున నడికూడలో బిఆర్ ఎస్ పార్టీ కి భారీ షాక్ తగిలింది, ఆ  పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ తాజా ఎంపీటీసీ అప్పం చేరాలు, మాజీ సర్పంచ్ లక్ష్మి- చేరాలు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఎమ్మెల్యే నివాసం లో నూతనంగా చేరుతున్న వారికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పరకాల నియోజకవర్గం శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త పాత తేడా లేకుండా పార్టీ కి సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరిని కాపాడుకుంటాం అని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈర్ల చిన్ని, మండల సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీతోనే ప్రజా సమస్యల పరిష్కారం

**జిల్లా కోశాధికారి శీలపాక నాగరాజ్**



అక్షర దర్బార్, చిట్యాల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాబోయే స్థానిక ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ పోటీ చేసి విజయం సాధిస్తుందని జిల్లా కోశాధికారి శీలపాక నాగరాజ్ అన్నారు. చిట్యాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పార్టీ అధినాయకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక-రాజకీయ చైతన్యం కోసం ధర్మయుద్ధం చేస్తామని తెలిపారు. అగ్రవర్ణ పార్టీల కారణంగా మెజారిటీ ప్రజలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించిన ఆయన, ధర్మసమాజ్ పార్టీ మాత్రమే సమాన అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. విద్య, ఉద్యోగాలు, నామినేటెడ్ పదవుల్లో ముందుగా సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పర్లపల్లి కుమార్, ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రమేష్, కార్యదర్శి మట్టేవాడ కుమార్, కమిటీ నాయకులు చిలుముల శశికుమార్, చిలుముల కృష్ణ, పర్లపెల్లి వంశీ, బొడ్డు పాల్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఇతర స్థానిక నాయకులతో కలిసి ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను పరామర్శించారు. లక్ష్మీపురం తండాకు చెందిన నగవత్ గణేష్, చెంచు కాలనీలోని ఇండ్ల సమ్మయ్య, చల్లగారిగ గ్రామానికి చెందిన జలిగాపు రవి తల్లి పోశమ్మ కుటుంబాలను సందర్శించి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామని తిరుపతి హామీ ఇచ్చారు.



## ఘనంగా ఆర్ఎస్ఎస్ పథసంచలన

అక్షర దర్బార్, నర్సంపేట: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతజయంతిని పురస్కరించుకుని నర్సంపేట నగరంలో సోమవారం ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు ఘన పథసంచలన (కవాతు) నిర్వహించారు. నెక్కొండ, చెన్నారావుపేట, నర్సంపేట, ఖానాపురం మండలాల స్వయంసేవకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రూట్ మార్చ్, భరత మాత, డాక్టర్ జీ, గురూజీ చిత్రపటాలు, భగవద్వజం (కాషాయ జెండా) తోపాటు భగవద్వజంపై పూలు చల్లి స్థానికులు, మహిళలు మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి, ఆర్ఎస్ఎస్ నర్సంపేట సంఘచాలక్ మోతే సమ్మీ రెడ్డి, విభాగ్ ప్రచారక్ విఘ్నేశ్వర్, గణవేషధారి స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణపై అవగాహన ఉండాలి

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ**

భూపాలపల్లి, అక్షర దర్బార్  : జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం ఐడిఓసి కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సిబ్బందికి సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నామినేషన్ నుంచి లెక్కింపు వరకు సిబ్బంది అప్రమత్తంగా, ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. సిబ్బంది పాలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, మెటీరియల్ పంపిణీ, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి అని ఆయన చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డిఓ బాలకృష్ణ, డిఈఓ రాజేందర్, సిపిఓ బాబురావు తదితరులు పాల్గొన్నారు.





# బాకీ కార్డులతో బీఆర్ఎస్ కొత్త నాటకం

**: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**

అక్షర దర్బార్, శాయంపేట: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి బాకీ కార్డుల పేరుతో బీఆర్ఎస్ పార్టీ కొత్త నాటకం ఏర్పాటు చేసినట్లు విమర్శించారు. శాయంపేట మండలంలో సోమవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహం నుండి పిఎసిఎస్ భవనానికి శిలాఫలకం వరకు పాదయాత్ర చేసి పిండప్రధానం కార్యక్రమం నిర్వహించారు. బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ గత పదేళ్ల పాలనలో హామీలను అమలు చేయకపోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఘాతుకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల, రుణమాఫీ, సన్న బోనస్, ఉచిత కరెంట్, ఉచిత బస్సు, రేషన్ పంపిణీ వంటి హామీలు అమలులో ఉన్నాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై వృత్తాంతాలలో అవినీతి, పిఎసిఎస్ భవనానికి బాకీ రుసుములు చెల్లించకపోవడం వంటి ఆరోపణలు మళ్ళీ గుర్తుచేశారు. మినహాయింపు: చల్ల చక్రపాణి, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చిట్టి రెడ్డి రాజిరెడ్డి, మరపెల్లి రవీందర్, సామల మధుసూదన్, దుబాసి కృష్ణమూర్తి, చిందం రవి, హైదర్ వెంకట్ రాజిరెడ్డి, నాగరాజు నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

అక్షర దర్బార్, పరకాల: స్థానిక ఎన్నికల నేపథ్యంలో దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితుల కోసం సోమవారం ఎస్.ఐ. కొంక అశోక్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలు మెరుగుపరచడానికి ఈ కౌన్సిలింగ్ చేపట్టబడిందని, ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎస్ఐ అశోక్ ప్రజలకు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్లు ఎలాంటి అవాంఛనీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని, పోలీస్ శాఖ శాంతియుత ఎన్నికల నిర్వహణ కోసం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

# విద్యుత్ కార్మికుడు అంజి మృతి



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్లో పని చేసిన కార్మికుడు జన్నే అనిల్ (అంజి) (30) చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. జులైలో విద్యుత్ మరమ్మత్తు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు స్తంభం పైనుండి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అంజికి వైద్యం కోసం ఆయన కుటుంబం రూ.20 లక్షల వరకు ఖర్చు పెట్టింది. అంజి ఆర్థిక స్థితిపై 'అక్షర దర్బార్' కథనానికి కదలివచ్చిన దాతలు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినా ఆయన ఆరోగ్యం మెరుగు పడలేదు. అంజి మృతితో ఆయన స్వగ్రామం మొట్లపల్లిలో విషాద వాతావరణం నెలకొంది.

# ఈసీ ఆదేశాలు తుంగలో!

**గ్రామాల్లో దర్శనమిస్తున్న పార్టీ జెండాలు, శిలాఫలకాలు**



అక్షర దర్బార్ శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల నియమావళికి తూట్లు పొడుస్తున్నారు.ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి రోజులు గడుస్తున్నా మండలంలోని పలు గ్రామాల్లో ఆయా రాజకీయ పార్టీ జెండాలను తొలగించ లేదు. వాల్ రైటింగ్లను సైతం చెరిపేయడం లేదు. శిలాఫలకాలు యధావిధిగా దర్శనమిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులు విధుల పట్ల అలసత్వం వహిస్తున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. ఇప్పుడే పరిస్థితులిలా ఉంటే ఎన్నికల నిర్వహణలో ఎన్ని అవకతవకలు జరగుతాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.


# నార్లపూర్-వెంకటేశ్వరపల్లి రోడ్డు నిర్మించాలి

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం నార్లపూర్ నుండి వెంకటేశ్వరపల్లి, ముత్యాలపల్లిగూడెం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి బీభత్సంగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సదుపాయం లేక రైతులు పొలాలకు వెళ్లడం కష్టమైపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వెంటనే స్పందించి ఈ రోడ్డు పనులను ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు కష్టమవుతున్నాయి. రహదారి అభివృద్ధి అత్యవసరం" అని గ్రామస్థులు పేర్కొన్నారు.



# ఎన్నికల హామీలను అమలు చేయాలి

- అప్పటిదాకా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- గ్రామాల్లో బాకీ కార్డుల పంపిణీ





అక్షర దర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఎన్నికల హామీలు అమలు అయ్యే వరకు ప్రభుత్వం మీద ఒత్తిడి కొనసాగిస్తామని తెలిపారు. ఆయన ఈరోజు వేశాలపల్లి 11వ వార్డు మరియు కొంపల్లి గ్రామాల్లో ప్రతి ఇంటికి కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేసి ప్రజలకు హామీలను గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, మహిళలకు రూ. 2,500 అందించలేదని, విద్యార్థులకు స్కూటీలు, రైతులకు యూరియా బస్తాలు ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి అందలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 38 నెలల్లో ఇంకా హామీలు అమలు చేయవలసిన సమయం ఉన్నందున, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూపాలపల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాకీ కార్డులతో నిలదీయాలి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వరరావు**

అక్షర దర్బార్, దుగ్గొండి: రానున్న స్థానిక ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను బాకీ కార్డులు చూపించి నిలదీయాలని దుగ్గొండి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుకినే రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. గిర్నిబావి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో శానబోయిన రాజకుమార్, పెండ్యాల రాజు, కంచరకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, గుండెగొరి రంగారావు, సంకేషి కమలాకర్, భూంపల్లి రజినీకాంత్ రెడ్డి, ముదురుకుల కృష్ణ, సంగతి రాజన్న, సంగతి కార్తీక్, కొల్గూరి మోహన్ రావు, బండి జగన్, మైసంపల్లి ఉప సర్పంచ్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాకీ కార్డుల పంపిణీ



అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వైనాల వీరస్వామి, గ్రామాభివృద్ధి అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, సామల దేవేందర్, గోనెల నరహరి, అనిల్, ప్రకాశ్ నవీన్, పరికి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## టేకుమట్ల మండలంలో..



అక్షర దర్బార్, టేకుమట్ల : టేకుమట్ల మండలంలోని రామకిష్టాపూర్ (టి) గ్రామం, మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో "ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డు" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరై, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. "గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలి" అని పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో పల్లె అభివృద్ధి, హరితహారం, డంపింగ్ యార్డులు, స్మశానవాటికలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు వంటి అనేక కార్యక్రమాలు అమలు అయ్యాయని ఆమె గుర్తుచేశారు.

# చిట్యాల బస్టాండ్ ను ప్రారంభించాలి

**ఏబీవీపీ కన్వీనర్ రాజ్ కుమార్**



అక్షర దర్బార్, చిట్యాల : నిర్మాణం పూర్తై దశాబ్దం గడిచినా చిట్యాల బస్టాండ్ను ప్రారంభించకపోవడం సిగ్గుమాలిన విషయం అని ఏబీవీపీ ప్రాంత హాస్టల్ కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి బస్టాండ్ను ప్రారంభించకపోతే, వేలాది విద్యార్థులతో కలిసి ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వయంగా బస్టాండ్ ప్రారంభిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండ్ అందుబాటులోకి వస్తే విద్యార్థులు, వ్యాపారస్తులకు ఉపయోగం కలుగుతుందని అన్నారు. ఎన్నికల కోడ్ను కారణం చూపకుండా తక్షణం బస్టాండ్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముష్కే అజయ్, శేషి వర్ధన్, సాయి చరణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న మొబైల్ అందజేత



అక్షర దర్బార్, చిట్యాల : గత ఆరు నెలల క్రితం పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ను చిట్యాల ఎస్ఐ జి. శ్రావణ్ కుమార్ రికవరీ చేసి బాధితుడు చిలుక రాకేష్కు అందజేశారు. రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ లాల్ సింగ్ సీఐఆర్ పోర్టల్లో నమోదు చేయగా, ఫోన్ వరంగల్లో గుర్తించబడింది. అనంతరం ఎస్ఐ శ్రావణ్ కుమార్ మొబైల్ను తెప్పించి బాధితుడికి అప్పగించారు. మొబైల్ తిరిగి అందించినందుకు రాకేష్ ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపాడు.

# సిటీలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్

- నగర మేయర్ గుండు సుధారాణి
- సీపీపీఎఫ్ లో భాగంగా శక్తి, పీడబ్ల్యుసీ ఏజెన్సీల పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- 80- 100 టన్నుల బయో గ్యాస్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించాలన్న మేయర్

అక్షరదర్బార్, వరంగల్: నగరంలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ (సుబీజీ)ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం క్లైమేట్ ప్రాజెక్ట్స్ ప్రిపరేషన్ ఫెసిలిటీ (సీపీపీఎఫ్)లో భాగంగా శక్తి, పీడబ్ల్యుసీ ఏజెన్సీలు ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమానికి మేయర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో 80 – 100 టన్నుల సామర్థ్యం గల బయో మిథనైజేషన్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా డీపీఆర్ తయారు చేయాలన్నారు. ఇందుకోసం రెండు ఏజెన్సీలతో కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకొని డీపీఆర్ తయారీ కోసం కృషి చేయడం జరుగుతుందని, వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఇరు ఏజెన్సీలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అందజేశారని, ఇందుకోసం నగరంలో అవలంబించే శానిటేషన్ విధానాలను వారు సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేసి ప్రజల సహకారంతో పాటు తడి పొడి చెత్తను వేరు చేసి అందజేయడానికి ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అంశాలను వారు సూచించడమే కాకుండా చెత్త సేకరణలో భాగంగా కమర్షియల్ చెత్త సేకరణ, హౌస్ హోల్డ్ ల సహకారం, చెత్త రవాణ తీరు, డంప్ యార్డ్ కు తరలించే పద్ధతులు అధ్యయనం చేస్తారని అన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి మన కెపాసిటీకి అనుగుణంగా 10 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, ఈ ప్లాంట్ రూపకల్పనలో పీపీపీ మోడ్ విధానాన్ని అవలంబిస్తారని, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ – 2016 ప్రకారంగా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని డీపీఆర్ సిద్ధం చేస్తారని ఈ సందర్భంగా మేయర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్ ఓ డా రాజారెడ్డి, ఎంహెచ్ ఓ డా రాజేష్, ఈఈలు మహేందర్, రవికుమార్, సంతోష్ బాబు, డీఈ శివానంద్ తో పాటు ఎన్ ఐయుఏ కో– ఆర్డినేటర్ అనురీత, పీడబ్ల్యుసీ మేనేజర్ రాహుల్ జీ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కు బాకీ పదం ఎత్తే అర్హత లేదు

- మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది
- అన్ని వర్గాలకు అన్యాయం చేసింది
- రైతుబంధు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది
- బీఆర్ఎస్ పై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీ ధ్వజం
- బీఆర్ఎస్ చేస్తుంది బాకీ కార్డ్ కాదు డోకా కార్డ్ అని ఫైర్




అక్షరదర్బార్, హనుమకొండ: మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్ పార్టీకి బాకీ అనే పదం ఎత్తే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ విమర్శించారు. సోమవారం హనుమకొండలోని డీసీసీ భవన్ లో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ బీఆర్ఎస్ కా డోఖా కార్డు పేరుతో కార్డులను విడుదల చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డు ప్రచారం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో 7 లక్షల కోట్ల అప్పులు చేసింది మీరు కాదా అంటూ సూటిగా ప్రశ్నించారు. ఆ అప్పులకు వడ్డీలు కడుతూనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ మద్దతు ఇవ్వకుండా బీజేపీ కొమ్ము కాసిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ లను నియమించకుండా విద్యార్థులకు అన్యాయం చేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పింది. ఇలా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రైతుబంధు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం. 40 లక్షల మంది పేదలకు రేషన్ కార్డులు ఇవ్వకుండా బాకీ పడ్డది భారత రాష్ట్ర సమితి కాదా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అక్రమాలను సరి చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో పాటు యువతకు 59 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఈ స్థాయిలో ప్రజా సంక్షేమానికి కృషి చేసిన రాష్ట్రం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేస్తుంది బాకీ కార్డ్ కాదు అని అది డోకా కార్డు అని విమర్శించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు రానున్న రోజుల్లో అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఈవీ శ్రీనివాసరావు, బత్తిని శ్రీనివాసరావు, తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ, వెంకట్ రెడ్డి, బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

# గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఎన్నిక

**అధ్యక్షుడిగా తడక శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా తడక సుధాకర్ గౌడ్**



అక్షర దర్బార్, పరకాల: పెద్దకోడెపాక, మైలారం గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఏకగ్రీవంగా పెద్దకోడెపాక అధ్యక్షునిగా తడక శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా తడక సుధాకర్ గౌడ్ ,గౌరవాధ్యక్షునిగా తడక ఈశ్వర్ గౌడ్ ,మైలారం అధ్యక్షునిగా ఐలి రాజు గౌడ్, ఉపాధ్యక్షుడిగా అయిలీ సురేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు తడక ఆగయ్య గౌడ్, తడక తిరుపతి గౌడ్ ,రాపర్తి మల్లయ్య గౌడ్, గట్టు కొమురయ్య గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఐలి తిరుపతి గౌడ్, తడక శంకర్ గౌడ్ లను కుల సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# గుంతలు పూడ్చివేత







అక్షర దర్బార్ శాయంపేట : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలంలోని శాయంపేట నుండి మైలారం గ్రామానికి వెళ్ళే దారిలో రోడ్డుకి ఇరువైపులా గుంతలు ఏర్పడ్డాయి.గమనించిన ఎస్ఐ జె.పరమేశ్ పోలీస్ సిబ్బంది సహాయంతో సోమవారం ఎవరికి ప్రమాదం జరగకుండా వెంటనే స్పందించి మట్టితో పూడ్చడం జరిగింది.

# గుడుంబా పట్టివేత

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం సూర్య నాయక్ తండా గ్రామంలో ప్రభుత్వ నిషేధిత గుడుంబా పట్టుకున్నట్లు శాయంపేట ఎస్సై జై పరమేశ్వర్ తెలిపారు.ఎస్సై కథనం ప్రకారం తన సిబ్బందితో సూర్యానాయక్ తండా గ్రామం నందు పెట్రోలింగ్ చేస్తుండగా అజ్మీరా రాజు తన ఇంటి వద్ద గుడుంబా అమ్ముతున్నాడనే నమ్మదగిన సమాచారం రాగా వెళ్లి చూడగా వారింట్లో గుడుంబా అమ్ముతూ కనిపించినాడు.పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి 22లి. గుడుంబాను స్వాధీనం చేసుకొని అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై గుడుంబాను అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల ప్రజలను హెచ్చరించడం జరిగింది.

# 237 కొనుగోలు కేంద్రాలు

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సన్నాహక సమావేశం



అక్షరదర్బార్ , మహబూబాబాద్: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. 2025–26 ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిర్వహణ కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె అనిల్ కుమార్, సంబంధిత అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్ లో ముందస్తు ప్రణాళిక ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఐకేపీ, గిరిజన కార్పొరేషన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, తదితర సంస్థల ద్వారా సుమారు 237 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అందుకోసం జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు కేంద్రాల కమిటీ ద్వారా ప్రభుత్వం సూచించిన ప్రకారం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు.
ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయ శాఖ ద్వారా స్వీకరించి కేంద్రాలకు వచ్చే ధాన్యం పూర్తి వివరాలు కొనుగోలు, రవాణా, ప్యాడి క్లీనర్స్, వేయింగ్ మిషన్స్, మ్యాచ్చర్స్, మిషన్లు, తదితర అంశాలపై క్షేత్రస్థాయి అధికారులందరికీ శిక్షణ తరగతులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో గన్ని సంచులను అవసరానికి అనుగుణంగా ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు పంపేలా ప్రణాళిక ప్రకారం లారీలను, హమాలీలను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లకు సంబంధించి ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, కేంద్రాల్లో నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించడం కోసం అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ మధుసూదన రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఏఓ విజయనిర్మల, సివిల్ సప్లై డీఎం క్రిష్ణవేణి, మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్టీవో సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915